
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 14 । ఆగస్టు । 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 21.793 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 441 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.60,720
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,453
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,617
సవర (8 గ్రాములు)	రూ.44,936

గరిష్టం/కనిష్టం 36.2 /28.7

వాతావరణం

ఆదివారం గాలిలో తేమ 50 శాతం ఉంది. సోమవారం ఎండతీవ్రత, ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

మూడో యూనిట్‌లో ఉత్పత్తికి బ్రేక్

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో రెండు యూనిట్ల నుంచి మాత్రమే విద్యుదుత్పత్తి జరుగుతోందని ప్రాజెక్ట్ ఇంజినీర్లు ఆదివారం తెలిపారు. 1వ యూనిట్‌లో 475 మెగావాట్లు, 2వ యూనిట్‌లో 450 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. సాంకేతిక కారణాల వల్ల 3వ యూనిట్‌లో ఉత్పత్తి నిలిపివేశారు.

ప్రతిష్టాత్మకంగా సీ ఫుడ్ ఫెస్టివల్

- ముగిసిన ప్రదర్శన



స్టాల్‌ను తిలకిస్తున్న చిన్నారులు

నెల్లూరు(సెంట్రల్): ఆక్వా రైతులకు అండగా ఉండేలా మూడు రోజులపాటు నెల్లూరులో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సీ ఫుడ్ ఫెస్టివల్ ఆదివారంతో ముగిసింది. మొదటి రోజు నుంచి మూడో రోజు వరకు నెల్లూరు జిల్లాతోపాటు ఒంగోలు, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన ఆక్వా రైతులు, సీ ఫుడ్ ప్రియులు ఈ కార్యక్రమానికి విచ్చేశారు. సీ ఫుడ్ ఫెస్టివల్ సందర్భంగా 24 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. వీటిలో వివిధ రకాల చేపలు, రొయ్యలు, పీతలు ప్రదర్శనలో ఉంచారు. ఈ స్టాల్స్‌లో సీ ఫుడ్‌కు సంబంధించి వివిధ రకాల పచ్చళ్లు, ఊరగాయలు అందుబాటులో ఉంచారు. ప్రత్యేకించి చేపలు, రొయ్యల కూరలు ఘుమఘుమలాడాయి. మత్స్యశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు నేతృత్వంలో నిర్వహించిన ఈ సీ ఫుడ్ ఫెస్టివల్‌ను చివరి రోజు జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ సుందరవల్లి స్టాల్స్‌ను సందర్శించారు. వివిధ జిల్లాల మత్స్యశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్ కరెస్పాండెంట్ చేతివాటం

- బ్యాంక్‌లో పొదుపు రుణాలు జమ చేయని వైనం

సంగం: సంగం కెనరా బ్యాంక్‌లో కమిషన్ తరహాలో బిజినెస్ కరెస్పాండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న షాజహాన్ పొదుపు గ్రూపు మహిళలు రుణాలు చెల్లించమని ఇచ్చిన నగదును స్వాహా చేయడంతో మహిళలు ఆదివారం పోలీసులను ఆశ్రయించారు. పొదుపు మహిళలు సంగం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులోని వివరాల మేరకు మర్రిపాడు గ్రామానికి చెందిన చెన్నకేశవ, బీబీ ఫాతిమా, బాలాజీ పొదుపు గ్రూపు సభ్యులు రెండు సంవత్సరాల క్రితం రూ.25 లక్షలు పొదుపు రుణం తీసుకున్నారు. అదే గ్రామానికి చెందిన షాజహాన్ సంగం కెనరా బ్యాంక్‌లో కమిషన్ బిజినెస్ కరెస్పాండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. షాజహాన్, పొదుపు రుణాలు పొందిన మహిళలది ఒకే గ్రామం కావడంతో ప్రతి నెలా పొదుపు రుణాలు పొందిన మహిళలు నెలనెలా తిరిగి చెల్లించే క్రమంలో నగదును షాజహాన్‌కు అందించారు. అయితే షాజహాన్ ఆ నగదును బ్యాంక్‌లో చెల్లించలేదు. పొదుపు మహిళలు ఇటీవల సంగం కెనరా బ్యాంకుకు వెళ్లగా మూడు గ్రూపులకు సంబంధించి సుమారు రూ.10 లక్షలకు పైగా చెల్లించాల్సి ఉందని మేనేజర్ చెప్పడంతో షాజహాన్‌ను నిలదీశారు. మోసం చేసిన షాజహాన్‌ను బ్యాంక్ విధుల నుంచి అధికారులు తొలగించారు. ఈ విషయమై డబ్బులు ఇవ్వాలని కోరిన పొదుపు మహిళలకు తాను చెల్లించలేనని షాజహాన్ చెప్పడంతో బాధితులు సంగం పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన ఎస్సై నాగార్జునరెడ్డి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మురిసిన మెట్ట భూములు



రైతులకు మరింత మేలు చేయాలనే తలంపుతో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ, సాగునీటి పారుదల రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా సోమశిల ఉత్తర కాలువ ఆధునికీకరణ కోసం వందల కోట్ల రూపాయల నిధులు కేటాయించి పనులు చేయిస్తోంది. ఫలితంగా పంట ఉత్పత్తులు భారీగా పెరిగి అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- ఉత్తర కాలువతో పెరిగిన ఫలసాయం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక నిధుల మంజూరు
- చురుగ్గా కాలువ విస్తరణ పనులు
- పంట పొలాలకు అందుతున్న నీరు
- దిగుబడులు పెరిగి రైతన్న సంతోషం



రామస్వామిపల్లి సమీపంలో జరుగుతున్న సోమశిల ఉత్తర కాలువ విస్తరణ పనులు (ఫైల్)



ఉత్తర కాలువ కింద సాగవుతున్న వరి పంట



33వ కిలోమీటర్ వద్ద సోమశిల ఉత్తర కాలువలో నీటి ప్రవాహం

సాక్షి, నెల్లూరు డెస్క్: స్వాతంత్ర్యానికి పూర్వం నెల్లూరు జిల్లాలో పెన్నానదిపై రెండు భారీ నీటిపారుదల పథకాలు మాత్రమే ఉండేవి. వాటిలో ఒకటి సుమారు 160 సంవత్సరాల క్రితం నగరానికి సమీపంలో నిర్మించిన నెల్లూరు ఆనకట్ట. రెండోది సంగం గ్రామ సమీపాన నిర్మించిన సంగం ఆనకట్ట. ఈ రెండు ఆనకట్టల కింద ఉండే సాగు ప్రాంతాన్ని పెన్నారు డెల్టాగా పిలుస్తుంటారు. ఆ తరువాత కాలంలో అనంతసాగరం మండలంలోని సోమశిల గ్రామం వద్ద సోమశిల జలాశయం నిర్మించారు.

రూ.522.17 కోట్లతో ఉత్తర కాలువ విస్తరణ

1973లో అనుమతులు

భారత ప్రభుత్వం 1973లో ఐదో పంచవర్ష ప్రణాళికలో సోమశిల జలాశయం నిర్మించేందుకు రూ.17.20 కోట్ల అంచనాలతో అనుమతులు ఇచ్చింది. ఈ ప్రాజెక్ట్ నిర్మాణ పనులు 1976లో ప్రారంభమై 1989 నాటికి నిర్మాణం పూర్తి చేసుకుంది. సోమశిల రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 78 టీఎంసీలు. పెన్నా వరద జలాలను సోమశిల ఉత్తర కాలువ ద్వారా ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని గ్రామాల తాగు, సాగునీటికి వినియోగిస్తున్నారు. ఈ కాలువ సోమశిల డ్యామ్ వద్ద లెఫ్ట్ హెడ్ రెగ్యులేటర్ నుంచి మొదలై 73.920 కి.మీ. దూరం వెళుతుంది. ఈ కాలువ కింద 43,000 ఎకరాల ఆయకట్టుకు నీరందేది. అనంతరం కాలువ విస్తరణ చేపట్టి రాళ్లపాడు రిజర్వాయర్ వరకు పొడిగించారు. దీంతో నెల్లూరు జిల్లాలో 58,500 ఎకరాలు, ప్రకాశం జిల్లాలో(రాళ్లపాడు రిజర్వాయర్ ద్వారా) 40,000 ఎకరాలు అదనంగా సాగులోనికి తీసుకురావాలన్నది లక్ష్యం. ఈ కాలువ ద్వారా అనంతసాగరం, ఆత్మకూరు, మర్రిపాడు, ఏఎస్‌పేట, దగదర్తి, కొండాపురం, జలదంకి, కలిగిరి, సంగం మండలాలకు సాగు, తాగునీరు సరఫరా అవుతోంది.

రాళ్లపాడుకు వెలిగొండ నీళ్లు

రాళ్లపాడు ప్రాజెక్ట్‌కు కృష్ణా జలాలు అందనున్నాయి. వెలిగొండ నుంచి 1.17 టీఎంసీల కృష్ణా జలాలను కేటాయించిన నేపథ్యంలో సోమశిల ఉత్తర కాలువ ద్వారా రాళ్లపాడుకు చేరుతున్న 1.5 టీఎంసీల పెన్నా జలాలకు అదనంగా కృష్ణా నీళ్లు తోడవుతున్నాయి. పెన్నా, కృష్ణా జలాలు కలుపుకుని మొత్తం 2.67 టీఎంసీల నీరు రాళ్లపాడు ప్రాజెక్టుకు చేరాల్సి ఉంది. వెలిగొండ జలాలు వచ్చిన అనంతరం ఆయకట్టు 40 వేల ఎకరాలకు పెరుగుతుందని అంచనా.

సోమశిల ఉత్తర కాలువ విస్తరణ పనులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.632 కోట్లు మంజూరు చేసింది. రివర్స్ టెండరింగ్ విధానంలో 0.43 శాతం లెస్‌తో రూ.522.17 కోట్ల అంచనాలతో పనులు చేపట్టారు. రాళ్లపాడు రిజర్వాయర్‌కు సోమశిల జలాలను పూర్తిస్థాయిలో తరలించేందుకు ఈ విస్తరణ పనులు ఎంతో ఉపయోగం. సోమశిల ఉత్తర కాలువ ప్రారంభం వద్ద 700 క్యూసెక్కుల సామర్థ్యం ఉంది. అది రాళ్లపాడు వద్దకు వచ్చే సరికి 150 క్యూసెక్కులకే పరిమితమైంది. ప్రస్తుతం దీన్ని ప్రారంభం నుంచి 1,500 క్యూసెక్కులకు పెంచడంతోపాటు రాళ్లపాడుకు సోమశిల జలాలు వచ్చే కాలువలు కూడా 300 క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచేలా పనులు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు తగినంత సామర్థ్యం లేని కారణంగా రాళ్లపాడుకు సోమశిల నుంచి 60, 70 క్యూసెక్కులు మాత్రమే వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్తర కాలువ విస్తరణ చేపట్టాల్సిన ఆవశ్యకతను ప్రభుత్వం గుర్తించి కాలువ సామర్థ్యాన్ని రెట్టింపు చేయడంతోపాటు పూర్తిస్థాయిలో లైనింగ్ చేసేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఈ కాలువ విస్తరణ పనులు పూర్తయితే 1.5 టీఎంసీలు సునాయాసంగా పొందడమే కాక, అదనపు జలాలు కూడా తెచ్చుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది. సోమశిల జలాశయం ప్రారంభం నుంచి రాళ్లపాడు రిజర్వాయర్ వద్ద 99.730 కిలోమీటరు వరకు పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో గతేడాది కల్లా 50 కిలోమీటర్లకుపైగా కాంక్రీట్ గోడలు పనులు కాంట్రాక్టర్లు పూర్తి చేయగలిగారు. సోమశిల జలాశయం సాగు జలాలను రాళ్లపాడు రిజర్వాయర్‌కి తరలిస్తున్నారు. తద్వారా మెట్ట భూములు సస్యశ్యామలం అవుతున్నాయి.

సమృద్ధిగా సాగునీరు



సోమశిల ఉత్తర కాలువ ద్వారా సత్యవోలు చెరువుకు సమృద్ధిగా సాగునీరు అందుతోంది. నాకు ఈ చెరువు కింద 3.80 ఎకరాల మాగాణి భూమి ఉంది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు వర్షాలు లేక నా భూమిని బీడుగా వదిలేశాను. ప్రస్తుతం ఉత్తర కాలువ ద్వారా మా పొలాలకు సాగునీరు అందుతోంది. వరి పంట తరువాత పత్తి సాగుకు కూడా నీరు అందుతోంది. – మూలి మాల్యాద్రి, సత్యవోలు పంచాయతీ, లింగన్నపాళెం



రైతు పొలంలో బోరు ద్వారా వస్తున్న నీరు

నీటి ఇబ్బందులు తీరుతున్నాయి



సోమశిల ఉత్తర కాలువ ద్వారా సాగునీరు రాక ముందు ఏడాదికి రెండు సార్లు మంచి వర్షాలు కురిస్తేనే కానీ పంట చేతికి వచ్చేది కాదు. 2009 నుంచి ఉత్తర కాలువ ద్వారా కొమ్మి చెరువుకు సాగునీరు అందుతోంది. ప్రస్తుతం ఉత్తర కాలువ ద్వారా నీరు వస్తుండడంతో మా పొలాలకు నీటి ఇబ్బందులు తీరుతున్నాయి. సకాలంలో పంట చేతికి వస్తోంది. – గాడి హజరత్‌బాబు, కొమ్మి

భూగర్భజలాలు గణనీయంగా పెరిగాయి



నాకున్న 4 ఎకరాల పొలంలో గతంలో 8 బోర్లు వేశా. అందులో 3 బోర్లలో నీళ్లు పూర్తిగా రాలేదు. 5 బోర్లలో నామమాత్రంగా నీరు వచ్చేవి. గత ఐదేళ్లుగా సోమశిల ఉత్తర కాలువకు నీరు విడుదల చేయడంతో భూగర్భజలాలు గణనీయంగా పెరిగాయి. ప్రస్తుతం రెండు బోర్లు మాత్రమే ఉపయోగించి వరి, వేరుశనగ పంటలు సాగు చేస్తున్నా. – ఎన్.చినమాలకొండయ్య, నాగసముద్రం, కలిగిరి మండలం

రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

- ప్రతి సచివాలయ పరిధిలో మల్టీపర్పస్ గోడౌన్‌లు
- ఎస్‌డబ్ల్యూసీ గోడౌన్ ప్రారంభోత్సవంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



గోడౌన్‌ను ప్రారంభించిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: రాష్ట్ర ప్రభుత్వం రైతుల అవసరాలను తీరుస్తూ వారికి అన్నివిధాలుగా అండగా నిలుస్తోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. మనుబోలు మండలం జట్లకొండూరు పరిధిలో రూ.10 కోట్లతో నిర్మించిన 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోడౌన్‌ను ఆదివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ జిల్లాలో 1.34 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోడౌన్‌లు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. పంట చేతికొచ్చి రైతులు కోరుకున్న ధర లేనప్పుడు వారి ఉత్పత్తులను నిల్వ చేసుకుని మెరుగైన ధరకు అమ్ముకునేందుకు వీలుగా అన్ని ప్రాంతాలకు గోడౌన్‌లను విస్తరిస్తున్నామని తెలిపారు. అన్ని సచివాలయాల పరిధిలో 500 నుంచి 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన మల్టీపర్పస్ గోడౌన్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతం మొదటి దశ గోడౌన్‌ల నిర్మాణం జరుగుతోందని, అవి పూర్తయ్యాక రెండో దశ మొదలు పెడతామని తెలిపారు. అన్నిరకాల పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునే విధంగా వేర్‌హౌసింగ్ గిడ్డంగులు, పీఏసీఎస్‌లు, ఆర్‌బీకేలను అనుసంధానం చేస్తున్నామని తెలిపారు. రైతుల అవసరాలు తీర్చడం కోసం ఏర్పాటు చేసిన ఆర్‌బీకేల ద్వారా విత్తనం నుంచి పంట అమ్మకాల వరకు అన్ని సేవలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. భవిష్యత్‌లో ఆర్బీకేలు బ్యాంకింగ్ వ్యవస్థలుగా పనిచేస్తాయన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అగ్రిఫండ్ తీసుకొచ్చి గోదాములు, డ్రయింగ్ ప్లాట్‌ఫాం తదితర సౌకర్యాలను కల్పిస్తున్నామని తెలిపారు.

బురద చల్లడమే ప్రతిపక్షాల పని

తమ ప్రభుత్వ హయాంలో ఒక్క రైతు కూడా గిట్టుబాటు ధర లేదని ఫిర్యాదు చేయలేదని మంత్రి పేర్కొన్నారు. అయితే ప్రతిపక్షాలు చిన్న విషయాలను కూడా రాద్ధాంతం చేస్తూ ప్రభుత్వంపై బురద చల్లడమే ధ్యేయంగా పనిచేస్తున్నాయన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లేనప్పుడు, ధరలు విపరీతంగా పెరిగి వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నప్పుడు వెంటనే ప్రభుత్వం స్పందించి ఇద్దరికీ న్యాయం చేస్తుందన్నారు. టమాటాల ధరలు విపరీతంగా పెరిగితే ప్రభుత్వమే వినియోగదారులకు తక్కువ ధరకు సరఫరా చేసిందని గుర్తుచేశారు. అలాగే పసుపు ధర తగ్గినప్పుడు గోదాముల్లో నిల్వ చేసుకునే అవకాశం కల్పించి ధర పెరిగినప్పుడు అమ్ముకునే వెసులుబాటు రైతులకు కల్పించామన్నారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూసీ వైస్ చైర్మన్ శ్రీకంఠనాథరెడ్డి, కాంట్రాక్టర్ పంకజ్ రెడ్డి, ఆర్‌ఎం శ్రీరామయ్య, ఈఈ సురేందర్‌రెడ్డి, డీఈ ఆనంద్‌రెడ్డి, ఎంపీపీ వజ్రమ్మ, వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, సర్పంచ్ నాగమ్మ, ఉప సర్పంచ్ తులసీరాం, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు రక్ష.. జగనన్న సురక్ష

- సచివాలయాల పరిధిలో ఇంటింటి సర్వే
- ప్రజలకు అవసరమైన 5,77,374 సర్టిఫికెట్ల అందజేత
- ఉచితంగా పంపిణీ చేసిన ప్రభుత్వం
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు



అనంతసాగరం మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో సర్టిఫికెట్ అందజేస్తున్న అధికారులు(ఫైల్)

చిన్నచిన్న సాంకేతిక కారణాలతో సంక్షేమ ఫలాలు అందని ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందించేలా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టి విజయవంతంగా నిర్వహించింది. జిల్లాలో లక్షలాది ధ్రువీకరణ పత్రాలు అందజేసి లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంది.

నెల్లూరు(పొగతోట): రాష్ట్ర ప్రభుత్వం జూన్ 24 నుంచి జూలై 31వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు ఉచితంగా పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జిల్లా యంత్రాంగం 5,77,374 మందికి సర్టిఫికెట్లు ఉచితంగా పంపిణీ చేసింది. అధికారులు జిల్లాలో మొదట మనుబోలు మండలం పిడూరు గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేశారు. పిడూరులో సత్ఫలితాలు రావడంతో జిల్లావ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేసి విజయవంతంగా పూర్తి చేశారు.

విజయవంతంగా నిర్వహణ

జిల్లాలోని 769 సచివాలయాల పరిధిలో 32 లక్షల మంది ప్రజలు నివాసం ఉంటున్నారు. ఇప్పటి వరకు ప్రజలు తమకు అవసరమైన జనన, మరణ, కుల, ఆదాయం, నివాసం తదితర సర్టిఫికెట్ల కోసం మండల కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకునేవారు. అయితే ప్రభుత్వం ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను ఆయా గ్రామాల్లోనే ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ఉచితంగా అందజేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో వారంలో మూడు రోజులపాటు (మంగళ, గురు, శని వారాలు) 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని విజయవంతంగా జిల్లా యంత్రాంగం నిర్వహించింది. 13,744 క్లస్టర్ల పరిధిలో అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్ల వివరాలు సేకరించారు. 5,85,323 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు అవసరమని గుర్తించారు. 5,77,374 మందికి సర్టిఫికెట్లు ఉచితంగా అందజేశారు. 6,415 వినతులకు సరైన ఆధారాలు లేనందున వాటిని తిరస్కరించారు. వాటిలో 1,534 సేవలు అధికారుల పరిశీలనలో ఉన్నాయి. మిగిలిన సర్టిఫికెట్లను వీలైనంత త్వరలో ప్రజలకు అందించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

అడిగిన వెంటనే సర్టిఫికెట్ ఇచ్చారు



ఈమె పేరు ఆంద్రా ఈశ్వరమ్మ. మర్రిపాడు మండలం నందవరం గ్రామానికి చెందిన ఈమెకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ అవసరమైంది. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మండల అధికారులు, సచివాలయ సిబ్బంది ఆమె ఇంటికి వచ్చి వివరాలు సేకరించారు. గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఉచితంగా అందజేశారు. అడిగిన వెంటనే సర్టిఫికెట్ అందజేసిన అధికారులకు ఈశ్వరమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వానికి ధన్యవాదాలు



ఇతని పేరు యర్రమల సుధీర్. ఇతనిది మర్రిపాడు మండలం నందవరం. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అధికారులు, సచివాలయ ఉద్యోగులు నిర్వహించిన సర్వేలో సుధీర్ తనకు అవసరమైన ఇన్‌కమ్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష గ్రామసభలో అధికారులు సుధీర్‌కు ఇన్‌కమ్ సర్టిఫికెట్ ఉచితంగా అందజేశారు. త్వరగా ఇన్‌కమ్ సర్టిఫికెట్ అందజేసిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

5.77 లక్షల మందికి సర్టిఫికెట్లు



రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 5,77,374 మంది ప్రజలకు వివిధ రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందజేసింది. సుమారు రూ.2.97 కోట్ల విలువ చేసే సర్టిఫికెట్లను ప్రజలకు అందజేశాం. పెండింగ్‌లో ఉన్న సర్టిఫికెట్లను త్వరలో ప్రజలకు అందజేసేలా చర్యలు తీసుకుంటాం. – సాంబశివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ



స్వాతంత్ర్య దినోత్సవానికి సిద్ధమవుతున్న వేదిక



పరేడ్ గ్రౌండ్‌లో అతిథుల కోసం ఏర్పాటు చేసిన కుర్చీలు

పంద్రాగస్టుకు ముస్తాబు

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఈ నెల 15న నెల్లూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న నేపథ్యంలో అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు వివిధ శాఖల్లో విశేష సేవలందించిన అధికారులకు ఉత్తమ సేవా పురస్కారాలను అందించనున్నారు. అలాగే పలు పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇవ్వనున్న నేపథ్యంలో పరేడ్ గ్రౌండ్‌ను అధికారులు సిద్ధం చేస్తున్నారు.

ఫొటోలు – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



మినీబైపాస్‌లోని ఫ్లైఓవర్ వంతెనపై మువ్వన్నెల వెలుగులు



పేదలపై భారం పడకుండా..

ప్రతి ఏడాది రెండు నుంచి మూడు నెలల పాటు ఉల్లిపాయలు, టమాటాల ధరలు పెరగడం సర్వసాధారణం. ఈ పరిస్థితి ఒక ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు దేశం మొత్తం నెలకొంటుంది. అయితే ధరలు ఎంత పెరిగినా.. ప్రజలపై భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. సబ్సిడీపై టమాటాలను సరఫరా చేసింది. ప్రతి ఏటా జూన్, జులై నెలలో టమాటాలు ధరలకు రెక్కలు వచ్చినా, ప్రభుత్వం నేరుగా రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసి ప్రజలకు సబ్సిడీపై పంపిణీ చేస్తోంది. ఈ ఏడాది కూడా సాగు తగ్గడంతో ధరలు అమాంతం పెరిగాయి. అయితే ప్రభుత్వం తీసుకున్న చర్యలతో పేదలు లబ్ధి పొందారు.

- టమాటాల ధరలు అమాంతం పెరిగినా రూ.50కే విక్రయించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఇప్పటి వరకు జిల్లాలో 65 వేల కేజీల విక్రయాలు



ఇటీవల టమాటాల కొనుగోలుకు బారులు తీరిన ప్రజలు (ఫైల్)

నెల్లూరు(సెంట్రల్) : జిల్లాలో రబీ సీజన్‌లో మాత్రమే రైతులు టమాటాలను సాగు చేస్తుంటారు. అయితే వేసవి కాలంలో మాత్రం టమాటా సాగు జరగదు. కేవలం మదనపల్లి ప్రాంతంపై ఆధార పడాల్సిన పరిస్థితి ఉంటుంది. ఆయా ప్రాంతాల్లో అధిక శాతం రైతులు టమాటాల సాగుపైనే ఎక్కువగా ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. అందువల్లే మదనపల్లి, పలమనేరు ప్రాంతాల నుంచి జిల్లాకు టమాటాల దిగుబడి ఎక్కువగా ఉంటుంది.

సబ్సిడీపై విక్రయాలు

ప్రస్తుతం జూన్ నెల నుంచి టమాటా ధరలు భారీగా పెరిగి కిలో రూ.100 నుంచి రూ.130 వరకు చేరింది. జూలైలో మరింత పెరిగి కిలో రూ.200కు వచ్చింది. దీంతో తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. పేద ప్రజలపై ధరల భారం పడకుండా ఉండేందుకు సబ్సిడీపై టామాటాలను పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంది. నెల్లూరు నగరంలోని ఫత్తేఖాన్‌పేట, నవాబుపేటతో పాటు జిల్లాలోని కావలి, కందుకూరు రైతుబజారులో కిలో రూ.50కే విక్రయాలు చేయడం ప్రారంభించింది. ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ఒక రేషన్ కార్డుకు రెండు కిలోల చొప్పున విక్రయాలు చేసింది.

రూ.51 లక్షలకు పైగా సబ్సిడీ

జిల్లా ప్రజలకు సబ్సిడీపై టమాటాల విక్రయాలు చేయాలనే ఉద్దేశంతో వ్యవసాయశాఖ, మార్కెటింగ్ శాఖ ద్వారా పలమనేరు, మదనపల్లి ప్రాంతాల నుంచి కిలో రూ.110 నుంచి రూ.170 చొప్పున కొనుగోలు చేశారు. దీంతో ఇప్పటి వరకు 65 టన్నులు (65 వేల కేజీలు) జిల్లాలోని నాలుగు రైతుబజార్‌ల ద్వారా విక్రయాలు చేసింది. ఆయా ప్రాంతాల్లో కిలో రూ.170 వరకు కొనుగోలు చేసి సబ్సిడీపై కిలో రూ.50కే విక్రయాలు చేసింది. దాదాపుగా రూ.51 లక్షలకు పైగా ప్రభుత్వమే భరించి సబ్సిడీపై టమాటాల విక్రయాలు చేయడం గమనార్హం. ప్రస్తుతం టమాటాల ధరలు తగ్గుముఖం పట్టడంతో సబ్సిడీ టమోటాలను ప్రస్తుతానికి నిలిపివేసింది.

ఎక్కడా ఇబ్బందుల్లేకుండా..



టమాటా ధరలను కట్టడి చేసేందుకు అన్నిరకాల చర్యలు తీసుకున్నాం. తమ సిబ్బంది సుదూర ప్రాంతాలకు రాత్రీ పగలూ తేడా లేకుండా నేరుగా రైతుల వద్దకే వెళ్లి టమాటాలు సేకరించి సబ్సిడీపై ప్రజలకు అందజేశాం. ప్రస్తుతం ధర తగ్గడంతో నిలిపివేశాం.

– అనిత, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏడీ

ప్రభుత్వమే ఆదుకుంది



టమాటాల ధరలు అమాంతం పెరిగినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సబ్సిడీపై రూ.50 కే విక్రయాలు చేసి పేద, మధ్య తరగతి ప్రజలను ఆదుకుంది. విపత్కర సమయంలో ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తోంది.

– ఎస్.అశోక్‌కుమార్, ప్రైవేటు ఉద్యోగి

హోరాహోరీగా రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



మొదటి స్థానంలో నిలిచిన మినగల్లు ఎద్దులు

సంగం : మండలంలోని మక్తాపురం గ్రామంలో రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు ఆదివారం హోరాహోరీగా జరిగాయి. వైఎస్సార్‌సీపీ నేతలు పూనేటి ఫణికుమార్‌రెడ్డి, గడ్డం నవీన్‌కుమార్‌ల సహకారంతో ఏర్పాటు చేసిన పోటీలను వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత కంటాబత్తిన రఘునాథరెడ్డి ప్రారంభించారు. మొత్తం 24 జతల ఎడ్లు పోటీలో పాల్గొన్నాయి. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీగా హాజరై పోటీలను ఆసక్తిగా తిలకించారు. మినగల్లు గ్రామానికి చెందిన ఎం.మహేష్‌కు చెందిన ఎడ్లు మొదటి స్థానంలో నిలువగా, గంగపట్నానికి చెందిన పంబాల యోక్షితరెడ్డికి చెందిన ఎడ్లు రెండో స్థానంలో నిలిచింది. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత రావుల ప్రసాద్‌గౌడ్, సర్పంచ్ మానికల చంద్‌కుమార్, నిర్వాహకులు చైతన్య, సుశాంత్, వెంకటస్వామి, నరసయ్య, నాని, వెంకటేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి



చికిత్స పొందుతున్న శీనయ్య

వెంకటాచలం : మండలంలోని ఇడిమేపల్లి పంచాయతీ జంగాలపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పచ్చికాల శీనయ్య, పెంచలయ్యపై టీడీపీ కార్యకర్తలు దాడి చేసిన ఘటన ఆదివారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. గత టీడీపీ ప్రభుత్వంలో పచ్చికాల శీనయ్య స్థలంలో దౌర్జన్యంగా తాగునీటి సరఫరాకు సంబంధించి పైపులైన్ నిర్మించారు. కాగా శీనయ్య ఇటీవల తన స్థలంలో ఇంటిని నిర్మించుకున్నారు. దీనిపై సర్వే చేయించగా పైపులైన్ నిర్మాణం నివాసం లోపలే ఉందని అధికారులు చెప్పారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి సమక్షంలో ఆదివారం ఉదయం శీనయ్య నివాసంలో ఉన్న పైపులైన్ను తొలగించి, బయట ఏర్పాటు చేసేందుకు పనులు చేస్తుండగా గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు అనిల్, రమణయ్య, శీనయ్య కలిసి దౌర్జన్యంగా ఇంట్లోకి ప్రవేశించి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పచ్చికాల శీనయ్య, పెంచలయ్యపై దాడి చేశారు. క్షతగాత్రులను బంధువులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

తమ్ముడిపై అన్న దాడి



గాయపడిన వెంకటేశ్వర్లు

అనుమసముద్రంపేట : తమ్ముడిపై అన్న దాడి చేసి గాయపరిచిన ఘటన ఏఎస్‌పేట మండలంలోని కొండమీదకొండూరు గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కొండమీద కొండూరుకు చెందిన గోసల శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు అన్నదమ్ములు. ఆస్తి విషయంలో వీరి మధ్య విభేదాలు ఉన్నాయి. తండ్రి చనిపోవడంతో గోసల శ్రీనివాసులు వివాహానంతరం వేరు కాపురం పెట్టాడు. వెంకటేశ్వర్లు తన తల్లితోనే ఉంటున్నాడు. ఈ దశలో ఆస్తి కోసం శ్రీనివాసులు ప్రతిరోజు తల్లి, తమ్ముడితో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి ఆస్తి విషయమై వెంకటేశ్వర్లుతో శ్రీనివాసులు గొడవపడి రాడ్డుతో తలపై కొట్టాడు. దీంతో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే కూలిపోవడంతో వైఎస్సార్‌సీపీ నేత శ్రీనివాసులురెడ్డి వెంటనే 108 వాహన సహాయంతో నెల్లూరు వైద్యశాలకు తరలించారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పేకాట స్థావరాలపై దాడులు

సంగం : మండల కేంద్రమైన సంగం తూర్పు వీధి నిమ్మతోపు ప్రాంతంలో పేకాట స్థావరాలపై ఎస్సై నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. మొత్తం ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.1,460ల నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.45
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.8

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్:	రూ.144
లేయర్	రూ.92
బ్రాయిలర్ చికెన్:	రూ.250
స్కిన్‌లెస్ చికెన్:	రూ.274
లేయర్ చికెన్	రూ.156

రైస్‌మిల్లు ఆపరేటర్ దారుణ హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

ఆత్మకూరు: పట్టణంలోని తూర్పువీధిలో రైస్ మిల్లు ఆపరేటర్ దేవరింటి సత్యం (47) దారుణ హత్యకు గురయ్యాడు. శనివారం అర్ధరాత్రి జరిగిన హత్య ఉదంతం ఆదివారం తెల్లవారుజామున వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణం అరవపాళెం దళితకాలనీకి చెందిన దేవరింటి సత్యం పదేళ్ల క్రితం ఆత్మకూరులోని ఓ రైస్‌మిల్లులో ఆపరేటర్ (డ్రైవర్)గా చేరాడు. భార్య దేవితో కలిసి మిల్లు సమీపంలో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. ఈ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి ఆరుబయట నిద్రిస్తున్న తన భర్తను గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో పొడిచారని భార్య దేవి అతన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లింది. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న ఎస్సై ముత్యాలరావు తన సిబ్బందితో ఆస్పత్రికి చేరుకొని విచారణ జరిపారు. అనంతరం సీఐ వేణుతో కలిసి హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఆత్మకూరు డీఎస్పీ ఎస్.కోటారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం క్లూస్ టీం, పోలీసు జాగిలం ద్వారా హత్య జరిగిన స్థలం పరిసరాలను పరిశీలించారు. పూర్తిస్థాయి విచారణ జరిపి నిందితులను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. మృతదేహానికి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

అశ్రునయనాల మధ్య లక్షిత అంతిమయాత్ర



గ్రామంలో సాగుతున్న అంతిమయాత్ర

కోవూరు : తిరుమలకు వెళ్తూ వన్యమృగం దాడిలో మృతిచెందిన లక్షిత అంతిమయాత్ర స్వగ్రామం పోతిరెడ్డిపాళెంలో ఆదివారం అశ్రునయనాల మధ్య జరిగింది. ఆడుతూ పాడుతూ తిరిగిన చిన్నారి ఒక్కసారిగా మృతి చెందడంతో గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. అంతిమయాత్రలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. తల్లిదండ్రులు రోదనలతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అంతిమయాత్రలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నలుగోలు సుబ్బారెడ్డి, డీసీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి మాట్లాడుతూ లక్షిత కుటుంబానికి పార్టీ పరంగా అండగా ఉంటామన్నారు.

చిన్నారి మరణం బాధాకరం

- నా మాటలను వక్రీకరించారు
- ఎమ్మెల్యే ప్రసన్న వెల్లడి



చిన్నారి లక్షిత మరణం చాలా బాధాకరమని, దీనిపై తాను మాట్లాడిన మాటలను కొందరు వక్రీకరించారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఘటనా స్థలాన్ని పరిశీలించి కుటుంబసభ్యుల ద్వారా జరిగిన విషయాన్ని తెలుసుకోవాలని కోరానని, అయితే పచ్చమీడియా దానిని వక్రీకరించి రాయడం దారుణమన్నారు. ఘటన జరిగినప్పుడు అధికారులే కొంత అయోమయం చెందారని, అందువల్లే పూర్తిస్థాయిలో విచారించడం ద్వారా ఆ కుటుంబానికి న్యాయం జరిగేలా కృషి చేయాలని భావించినట్లు తెలిపారు. లక్షిత కుటుంబసభ్యులు తమ పార్టీకి చెందిన వారని, వారంతా తన కుటుంబసభ్యులతో సమానమన్నారు. చిన్నారి మృతి పట్ల కూడా రాజకీయం చేసి మాట్లాడడం సమంజసం కాదన్నారు.

ముగిసిన షూటింగ్‌బాల్ పోటీలు



బాలురు విభాగంలో విజేతగా నిలిచిన పల్నాడు జట్టు



బాలికల విభాగంలో విజేతగా నిలిచిన నెల్లూరు జట్టు

- విజేతలుగా నెల్లూరు, పల్నాడు జిల్లాలు

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని డీఎల్ఎన్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గత రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల జూనియర్ షూటింగ్ బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో మొత్తం 25 జిల్లాలకు చెందిన బాలబాలికల జట్లు పాల్గొన్నాయి. బాలుర విభాగంలో పల్నాడు, బాలికల విభాగంలో నెల్లూరు జట్లు విజేతలుగా నిలిచాయి. బాలురు విభాగంగా ద్వితీయ స్థానంలో విజయనగరం, తృతీయ స్థానంలో నెల్లూరు జట్లు నిలువగా, బాలికల విభాగంలో ద్వితీయ స్థానంలో కృష్ణా, తృతీయ స్థానంలో చిత్తూరు జట్లు నిలిచాయి. విజేతలుగా నిలిచిన జట్లకు అతిథులు జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా పోటీల నిర్వాహణాధ్యక్షుడు మోర్ల భరత్‌కుమార్ మాట్లాడుతూ పోటీల్లో గెలుపోటములు సహజమని, అయితే ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తిని చాటుకోవాలని కోరారు. రాబోయే రోజుల్లో జిల్లాలో మరిన్ని షూటింగ్ బాల్ పోటీలను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అసోసియేషన్ సభ్యులు విజయ్ కుమార్, మురళీ, పరమేశ్వరరెడ్డి, దేవేంద్ర, వినోద్, భరత్, మునిస్వామి, తిరుపతయ్య, మాధవరావు, బాలు, భీమతాటి వెంకటరమణయ్య పాల్గొన్నారు.

బాబు పాలనలో ఒరిగిందేమీ లేదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి : చంద్రబాబు హయాంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని, అందుకే ప్రజలు బాబును ఘోరంగా ఓడించారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలిలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. దేశంలోనే అత్యంత సీనియర్ రాజకీయ నాయకుడిగా చెప్పుకునే చంద్రబాబు ప్రజలకు చేసిన మంచి పని ఏదైనా ఉందా అని ప్రశ్నించారు. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి పేదలకు అండగా నిలిచారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో నాలుగు పోర్టులు, 11 ఫిషింగ్ హార్బర్లు నిర్మిస్తున్నారని చెప్పారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు ఇలాంటి మంచి పనులు ఏమైనా చేశారా అని ప్రశ్నించారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం, విద్య అందించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అలాగే సాగునీటి ప్రాజెక్టులను సైతం వేగవంతంగా పూర్తి చేయిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, జరుగుతున్న అభివృద్ధిని చూసి చంద్రబాబు ఓర్వలేకపోతున్నాడన్నారు. అందుకే వ్యక్తిగత దూషణలకు దిగుతున్నట్లు చెప్పారు. బాబు ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైపే ఉన్నారన్నారు.

ఒడిశా వాసి ఆత్మహత్య

- కాలిన గాయాలు తాళలేక..

నెల్లూరు క్రైమ్ : కాలిన గాయాల నొప్పులు తాళలేక హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న ఒడిస్సా వాసి హాస్పిటల్ భవనం పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన నగరంలోని ప్రభుత్వ హాస్పిటల్‌లో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం మాల్కాన్‌గిరి జిల్లా సలాం గ్రామానికి చెందిన జగబంధు అనే యువకుడు రెండు నెలల నుంచి రామాయపట్నం పోర్టులో కాంక్రీట్ పనులు చేసేందుకు వచ్చాడు. బలరామిరెడ్డి అనే కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తూ పోర్టు వద్దే నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో జగబంధు స్వగ్రామానికి సమీప గ్రామమైన దాకుడ్‌రాశికి చెందిన బగదూది (34)తో పాటు అతని స్నేహితులు రామాయపట్నం పోర్టులో పనిచేసేందుకు ఈనెల 6వ తేదీన వచ్చారు. అందరూ కలిసి పోర్టు ప్రాంతంలోనే నివాసం ఉంటూ పనులకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 7వ తేదీ బగదూది వంట చేసే క్రమంలో వంట పాత్రలో ఉన్న వేడి గంజి పొరపాటున జారీ మీద పడింది. దీంతో గాయాలపాలైన బగదూదిని చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలలో చేర్పించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరు ప్రభుత్వ సర్వజన హాస్పటల్‌లో చేర్పించారు. అప్పటి నుంచి బగదూది అక్కడే చికిత్స పొందుతుండగా, అతని స్నేహితులు జగబంధు, కైలాస్ ఇరువురు తోడుగా హాస్పిటల్‌లోనే ఉంటున్నారు. శనివారం అర్ధరాత్రి ఒంటి గంట వరకు సరదాగా మాట్లాడుకుని పడుకున్నారు. స్నేహితులు నిద్రించిన తరువాత మూడు గంటల ప్రాంతంలో బగదూది హాస్పిటల్ భవనం నాలుగో అంతస్తు నుంచి ఒక్కసారిగా కిందకు దూకేశాడు. నిద్రలేచిన జగబంధు, కైలాస్‌లు బగదూది బెడ్‌పై లేకపోవడంతో కిందకు వచ్చి చూడగా అతను తీవ్ర గాయాలతో పడి ఉన్నారు. వెంటనే ఎమర్జెన్సీ వార్డుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బగదూది మృతి చెందాడు. కాలిన గాయాల నొప్పులు భరించలేక హాస్పిటల్ భవనంపై నుంచి దూకి ఉంటాడని స్నేహితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు సమాచారం.